పొగాకు రైతు సమస్యలు పరిష్కరించాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రైతుల పొగాకు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కార్మిక కర్షక భవన్‌లో పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత సంవత్సరం బాగా రేటు పలకడంతో రైతులు పొగాకు పంట వైపు మళ్లారని చెప్పారు. రూ.18 వేలు గతంలో రేటు ఉండగా ఈ సంవత్సరం రూ15000 ఇస్తామని అది కూడా ఇవ్వకుండా రూ.5000, రూ.4000 ,రూ.6000 మాత్రమే ఇచ్చారన్నారు. ఇప్పటికీ చాలామంది రైతుల దగ్గర పూర్తిగా కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు మాటల్లో స్వర్గం చూపిస్తున్నారు తప్ప ఆచరణలో రైతులకు మేలు చేసింది లేదన్నారు. కర్నూలు జిల్లాలో ప్రధానంగా మూడు మండలాల్లో పంట విస్తారంగా వేశారు. కొన్ని మండలాల్లో వందల ఎకరాల్లో సాగు చేశారన్నారు. కంపెనీ వారు ప్రచారం చేయడం వల్ల పంట విస్తారంగా వేశారని వేసిన పంటను పూర్తిగా

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణ

కొనుగోలు చేయక పోవడం దుర్మార్గమన్నారు. రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, బహుముఖమైన సమస్యలతోని ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు ధరలు లేక ,ఎరువులు పురుగుల మందులు అందక ఇబ్బందులకు గురవుతున్నారని, వాటిని ప్రభుత్వం పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. యూరియా రూపాలలో ఆందోళన చేసినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. ఈ సమస్యపై పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డికి విజ్ఞాపన పత్రం ఇస్తే సానుకూలంగా స్పందించారన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరికి విజ్ఞాపన పత్రం ఇవ్వాలని వెళ్లగా రైతుల పట్ల, రైతు సంఘం నాయకుల పట్ల చాలా దురుసుగా, అనుచితంగా ప్రవర్తించారన్నారు. ఎక్కువసేపు నిలబడితే మక్కులు ఇరుగుతాయని అనడం ఒక ప్రజాప్రతినిధిగా తగునా ఇదేనా రాజ్యాంగం ఇచ్చిన స్ఫూర్తి అని ప్రశ్నించారు. రైతు సంఘం కార్యకర్తలపై ఎమ్మెల్యే అనుచరులు చెయ్యి చేసుకోవడానికి పోగా అక్కడున్న పోలీసులు నివారించడంతో సద్దుమణిగిందని తెలిపారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు రైతుల దగ్గరనే పొగాకు మిగిలి ఉన్నది రైతుల దగ్గర ఉన్న పొగాకును కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి పూర్తిగా కొనుగోలు చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడానికి సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపునిచ్చిందన్నారు. పొగాకు రైతులందరూ పాల్గొనాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

యాప్ కష్టాలు..!

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు గతంలో భారీ సమ్మె చేపట్టిన సమయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం పలు హామీలను కురిపించింది. గత వైసిపి ప్రభుత్వం హామీ ఇచ్చినా ఒక్క హామీని కూడా అమలు చేసిన పాపాన పోలేదు. ఎన్నికల ప్రచార సమయంలోనూ కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు పలు హామీలు ఇచ్చింది. అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా నేటికీ వారి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పాటు యాప్‌ల భారం పెరిగింది. ఇప్పటికీ వారు క్షేత్రస్థాయిలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సెంటరుకు చిన్నారులు ఆలస్యంగా వస్తే వారికి అన్నం కూడా పెట్టలేకపోతున్నామని వాపోతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా 16 ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 3,486 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 3,326 మంది అంగన్వాడీ కార్యకర్తలు, 3,170 మంది ఆయాలు పని చేస్తున్నారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల నుంచి ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలి. యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. కొంతమందికి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ కాక అవస్థలు పడుతున్నారు. ఈ యాప్‌ల నిర్వహణలో సక్రమంగా లేని, వివరాలు అప్‌లోడ్ కాని టీచర్లపై ఒత్తిడి చేస్తున్నట్లు అంగన్వాడీలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం కొత్తగా బాల సంజీవని కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌లో 7 నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారుల తల్లుల ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఆ వివరాలు అప్‌లోడ్ అయితేనే పిల్లలకు ఇవ్వాల్సిన బాలామృతం, గుడ్లు, పాలు ఇవ్వాలి. గతంలో మాన్యువల్‌గా సంతకాలు చేయించుకుని వాటిని అందించే వారు. కొత్తగా తెచ్చిన ఈ యాప్‌తో అంగన్వాడీలపై మరింత భారం పెరిగింది. గర్భిణులు, బాలింతలకు అందించే ఆహారం ఫొటోలను అప్‌లోడ్ చేసి ఇవ్వాల్సి ఉంది. తరచూ సాంకేతిక లోపంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని అంగన్వాడీలు చెబుతున్నారు. పని దినాల్లో ప్రతి అంగన్వాడీ కార్యకర్త ఉదయం 9 గంటలకోసారి, మళ్లీ సాయంత్రం 4 గంటలకు ముఖంతో ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. తర్వాత పిల్లల హాజరు ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఈ విధంగా హాజరు చేసుకుంటూ ఉంటే యాప్‌లో అప్‌లోడ్ చేయడానికే సమయం సరిపోతుంది. ఇక పిల్లలకు పౌష్టికాహారం ఎప్పుడు అందించాలని ప్రశ్నిస్తున్నారు. అప్‌లోడ్ చేసిన తర్వాత ఎవరైనా పిల్లలు ఆలస్యంగా వస్తే ఆహారాన్ని అందించే పరిస్థితి లేకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోతోందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రయివేట్ ప్రాజెక్టులకు పచ్చజెండా

ఉమ్మడి జిల్లాలో పలు ప్రయివేట్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో ఈ మేరకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. నంద్యాల జిల్లాలోని అవుకులో ఆర్‌విఆర్ ప్రాజెక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్ ద్వారా 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులను ఆ సంస్థకు కేటాయించేందుకు చేసిన అభ్యర్థనను ఆమోదించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని దోన్ పశ్చిమ ప్రాంతంలో 300 మెగా వాట్ల విండ్ పవర్ కెపాసిటీలను కేటాయించడం కోసం ప్రభుత్వ ఆదేశాలను సవరించి అనుమతినివ్వాలని రీన్యూ పవర్ ప్రయివేట్ లిమిటెడ్ అభ్యర్థనను కేబినెట్ ఆమోదించింది. అదే ప్రాంతంలో 600 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్ట్ కేటాయింపునకు రీన్యూ విక్రమ్ శక్తి ప్రయివేట్ లిమిటెడ్ అభ్యర్థనను ఆమోదించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

యూరియా కోసం పాట్లు

ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ఎరువు కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి ఎరువులు వస్తున్నాయని తెలియడం ఆలస్యం.. వ్యవసాయ పనులు మానుకుని గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉంటున్నారు. ఎరువుల కొరత నెలకొందనే సమాచారం రైతులను కలవర పెడుతోంది. ఖరీఫ్ సాగు సీజన్ ముంచుకొచ్చినా ఆశించిన స్థాయిలో నిల్వలు చేరలేదు. విత్తు మొలకెత్తాక డిఎపి, కాంప్లెక్స్, సింగిల్ సూపర్ పాస్ఫేట్ వంటి ఎరువులు వినియోగిస్తారు. ఇక పైరు ఎదుగుదలలో నత్రజని (యూరియా) ఎరువులను వాడతారు. సరిపడ ఎరువులు లేవనే సమాచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రధానోపాధ్యాయురాలితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

పాఠశాలలను పట్టించుకోండి

- ప్రభుత్వానికి సిపిఎం సూచన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నెహ్రూ మెమోరియల్ స్కూల్ , మునిసిపల్ హై స్కూళ్లలోని సమస్యలను పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, డి.గౌస్ దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పాఠశాలల పర్యటనలో భాగంగా సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎస్ఎండి. షరీఫ్ లతో కలసి గౌస్ దేశాయ్, నిర్మల లు పాఠశాలలకు సందర్శించారు. నెహ్రూ మెమోరియల్ హై స్కూలులో పిఇటి పోస్ట్ ఖాళీ ఉందని, అలాగే హిందీ పోస్టు కూడా ఖాళీగా ఉందని, విద్యార్థులు ఆడుకోవడానికి , గేమ్స్‌లో పాల్గొనడానికి పిఇటి లేదని ఆ పోస్టు భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. మౌలిక వసతులు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చదువుకోడానికి లైబ్రరీ కూడా లేదని కనీసం మ్యాగజీన్‌లు పత్రికలు కూడా రావడం లేదని తెలిపారు. నెహ్రూ మెమోరియల్ స్కూల్ కాంపౌండ్ లో సచివాలయం ఉండడంతో విద్యార్థి విద్యార్థులకు చదువులకు ఆటంకం అవుతోందని, తక్షణమే సచివాలయాన్ని వేరే ప్రాంతానికి మార్చాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ హైస్కూల్లో తక్షణమే వాష్‌రూమ్‌లకు టాయిలెట్లకు నీటి సరఫరా లేదని, రెండు బోర్లు వేయాల్సిన అవసరం ఉందని సిపిఎం నాయకుల దృష్టికి విద్యార్థిని, విద్యార్థులు తెచ్చారు. ఈనెల 30న ఇద్దరూ ఉపాధ్యాయులు రిటైర్ అవుతారని, ఈ పోస్టులను కూడా ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ పాఠశాలల పర్యటనలలో సిపిఎం పార్టీ నగర కమిటీ సభ్యులు మహబూబ్ బాషా, షేక్ అహ్మద్, రసూల్ అహ్మద్, బాషా భాయ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

బోధనేతర పనులను అప్పగించరాదు

- జీతాలను వెంటనే విడుదల చేయాలి
- డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయులకు బోధినేతర పనులను అప్పగించరాదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నవీన్ పాటి అన్నారు. ఇటీవల బదిలీ , పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు యుఆర్ఎ రవికుమార్ అధ్యక్షతన జరిగిన నిరసనలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి నవీన్ పాటి మాట్లాడారు. ఉపాధ్యాయులపై మానసిక వత్తిడి గురి చేస్తున్న బోధనేతర పనులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడి త్వరగా విడుదల చేయాలని కోరారు. అపరిస్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమస్యలన్నిటిని పరిష్కరించక పోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించా రు. జిల్లా సహా అధ్యక్షుడు హేమంత్ కుమార్, జిల్లా కార్యదర్శి లు ఇబ్రహీం, బాబు, జిల్లా నాయకులు బీడీ సుధీర్ రాజు, సర్వేశ్వర్ రెడ్డి, హనుమంతు, కిషోర్, షఫీవుల్లా, కాంతారావు, రాముడు, సురేష్ పాల్గొన్నారు.

వృద్ధుల ఇంటి వద్దకే రేషన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వృద్ధులకు ఇంటింటి రేషన్ పంపిణీ కార్యక్రమం శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. కర్నూలు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 46283 మంది కార్డుదారులు 65 ఏళ్లు పైబడిన వారు ఉన్నారన్నారు. దాదాపుగా 10000 (21శాతం) మంది 65 ఏండ్లు పైబడిన కార్డుదారులకు జిల్లా వ్యాప్తంగా ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందజేశామన్నారు. రేషన్ షాపుల వద్దకు వెళ్లి క్యూలో నిలబడి గంటల పాటు వేచి చూసి సరుకులు తీసుకోవలసిన ఇబ్బందులు తొలగిపోయినట్లుగా తెలిపారు.

రేషన్ సరుకులు అందజేస్తున్న జెసి నవ్య

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నాగస్వామినాయక్

ఒకేషనల్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని బి క్యాంప్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల లో శనివారం ప్రిన్సిపల్ డాక్టరఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ప్రిన్సిపల్ ప్రసంగిస్తూ కార్గిల్ ప్రాంతంలోని నియంత్రణ రేఖ వెంబడి భారత్ పాకిస్తాన్ మధ్య కార్గిల్ యుద్ధం 1999 మే 3 న ప్రారంభమయిందన్నారు. భారత సైన్యం ఆపరేషన్ విజయ్ పేరుతో మంచు పర్వతాలలో దాదాపు 60 రోజుల పాటు జరిగిన యుద్ధంలో 527 మంది భారత సైనికులు అమరులయ్యారని తెలిపారు. చివరికి జులై 26న భారత భూభాగంలోకి ప్రవేశించిన పాకిస్తాన్ సైన్యాన్ని తిప్పికొట్టి భారత భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం ద్వారా భారత్ విజయం సాధించిన సందర్భంగా ప్రతి సంవత్సరం జులై 26న కార్గిల్ విజయ దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ రామకృష్ణ, విజయశేఖర్, సోమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 61 అభ్యర్థులు ఎంపిక

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 61 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వివిధ స్థాయి ఉద్యోగుల భర్తీకి గాను జరిగిన జాబ్ మేళాలో 145 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపాత్రాలను అందించారు. అనంతరం ఎంపికైన వారిని కళాశాల ప్రిన్సిపల్ షేక్షావలి అభినందించారు. వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకుంటే మెరుగైన అవకాశాలు పొందవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎస్ఎస్డిసి స్టాఫ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ సాయి తేజ, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నదీ తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి సి బెళగల్

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తుంగభద్ర నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్ఐ తరుణ్ పేర్కొన్నారు. శనివారం గుండ్రేపుల, కొండాపురం, ముడుమాల గ్రామాల్లో సందర్శించి ప్రజలతో మాట్లాడారు. సి బెళగల్ మండలానికి ఆనుకొని నది ప్రవహిస్తుండగా మండలంలోని నది తీర గ్రామాలు 10 వరకు ఉన్నాయని అన్నారు. ఎగువ ప్రాంతాలు కర్ణాటకలో భారీ వర్షాలు కురిశాయని తుంగభద్ర డ్యామ్ నుండి 60 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారని పొలాల్లో ఉండి పోవడం, రాత్రి వేల గ్రామాల్లోకి చేరుకొనే అవకాశం ఉన్నంతున అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో దండోరా వేయించారు. విఆర్ఓలు, తళారులు పాల్గొన్నారు.

క్వాంటం కంప్యూటింగ్‌తో ఉజ్వల భవిష్యత్తు

-జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు
-పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో స్నాతకోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్వాంటం కంప్యూటింగ్‌తో ఉజ్వల భవిష్యత్తు ఉందని జెఎన్‌టియు వైస్ ఛ్సాలర్ హెచ్.సుదర్శన్ రావు అన్నారు. శనివారం కర్నూలు జి. పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగవ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. 2021- 25 బ్యాచ్ బి. టెక్ , 2023- 25 బ్యాచ్ ఎంబిఎ విద్యార్థులకు పట్టా ప్రదానోత్సవం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. విసి హెచ్.సుదర్శనరావు విద్యార్థులతో మాట్లాడుతూ మీరు ఎంత ఉన్నతస్థాయిలో ఉన్నా మీ తల్లిదండ్రుల త్యాగాలను మరవరాదన్నారు. ఏ బ్రాంచ్‌లో చదివినా విషయ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నప్పుడే ఏదైనా సాధిస్తారని అన్నారు. కృత్రిమ మేధా కన్నా మానవ మేధనే గొప్పదని చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్ రాబోయే రోజుల్లో అన్ని బ్రాంచిల్లో ఉంటుందని, మన రాష్ట్ర ప్రభుత్వం ఆసియా ఖండంలోనే మొట్టమొదటిసారి అమరావతిలో నెలకొల్పబోతుందని దీనివలన మరెన్నో అవకాశాలు వస్తాయన్నారు. అనంతపురం పరిధిలో అత్యుత్తమ విద్యను అందించే కళాశాల జి. పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల అని అన్నారు. అనంతరం రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి. పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు కంకణ బద్ధులై కృషి చేస్తూ భావి జీవితానికి పునాదులు వేసుకునే దశ కళాశాల దశ అన్నారు. కళాశాల విద్యను సద్వినియోగపరచుకోవాలని గుర్తు చేశారు. యువతరంలో అనంతమైన శక్తి దాగి ఉంటుందని, వచ్చిన అవకాశాలను సద్వినియోగపరచుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ జివిఎం.మోహన్ కుమార్ మాట్లాడుతూ మాకళాశాల గ్రామీణ ప్రాంతంలో నెలకొల్పి బడినప్పటికీ ప్రపంచ మేధావులను తయారు చేస్తుందని తెలిపారు. ఈ ప్రాంత తల్లిదండ్రులు అందిస్తున్న స్ఫూర్తితో మున్ముందు మా కళాశాలలను ఇంకా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు,వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థికి పట్టా ప్రదానం చేసి అభినందిస్తున్న జెఎన్‌టియు విసి సుదర్శన్‌రావు, పుల్లయ్య

సంక్షేమ బోర్డు కోసం పోరాటం

-భవన నిర్మాణ కార్మిక సంఘం నిర్ణయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసే వరకు పోరాటం చేస్తామని నూతనంగా ఎంపికైన భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.నరసింహులు, కమిటీ సభ్యులు కాజాపాషా చెప్పారు. శనివారం కార్మిక కర్షక భవన్‌లో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ జిల్లా కన్వీనర్ కె.సుధాకరప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహులు,కాజాపాషా మాట్లాడుతూ ఈనెల 23 ,24 తేదీల్లో గుంటూరు నగరంలో జరిగిన ఏపీ బిల్డింగ్ ఆధార్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఎనిమిదవ రాష్ట్ర మహాసభలు జరిగాయి. రాష్ట్ర మహాసభలో కర్నూలు జిల్లా నుండి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఆర్ నరసింహులు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎస్ కాజాపాష ఎన్నిక కావడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలియజేశారు. మన జిల్లా నుండి ఎన్నికైన నాయకులు భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తారని కార్మికులను సంఘటిత పరిచి పోరాటాల వైపు నడిపించి కార్మికులసమస్యల పరిష్కారం కోసం కషి చేయాలని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ఆర్ నరసింహులు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ కాజా బాషా గారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్రనాయకులుగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలియజేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై అధ్యయనం చేసి భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు సాధించే వరకు పోరాటం చేస్తాము అన్నారు.ఎన్నికల ముందు తెలుగుదేశం ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ప్రారంభిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని గతంలో ఎమ్మెల్యేలకు మంత్రులకు ముఖ్యమంత్రికి భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ప్రారంభించాలని కోరుతూ వినతి పత్రాలు పోరాటాలు చేసిన ప్రభుత్వంలో చలనం రావటం లేదన్నారు. మొద్దు నిద్రపోతున్న ప్రభుత్వాన్ని నిద్ర లేపడం కోసం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సాధన కోసం సెప్టెంబర్ 15న విజయవాడలోని లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడికి రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చామన్నారు. ఈ పిలుపులో భాగంగా కర్నూలు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించి కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి చలో విజయవాడ లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి అంటూ కార్మికవర్గాన్ని సిద్ధంచేయబోతున్నాం అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సాధనకై కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో ముట్టడి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. సిఐటియు నగర నాయకులు జి. ఏసు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్.నరసింహులు

రాష్ట్ర ఉపాధ్యక్షుడు
నరసింహులు

రాష్ట్ర కమిటీ సభ్యులు
కాజాపాష

నేడు పసుపుల సొసైటీ చైర్మన్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం పసుపుల వ్యవసాయ సహకార సొసైటీ చైర్మగా బళ్ళారి వెంకటరాముడు ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ముఖ్య అతిథులుగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, కెడిసిసిబి చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇన్చార్జి రామలింగారెడ్డి, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ప్రమాణ స్వీకార మహోత్సవం స్థానిక పసుపుల వ్యవసాయ సహకార సొసైటీ కార్యాలయంలో ఉదయం 11:30 గంటలకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పచ్చ జెండాలు, తోరణాలు ఫ్లెక్సీలతో ముస్తాబు చేశారు. కార్యక్రమానికి మండలం నియోజకవర్గ పరిధిలోని టిడిపి నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పసుపుల వ్యవసాయ సహకార సొసైటీ నూతన చైర్మన్ బళ్లారి వెంకట్ రాముడు కోరారు.

హైకోర్టు జడ్జికి స్వాగతం పలికిన జేసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్ లో ఆంధ్రప్రదేశ్ హై కోర్టు జడ్జి జస్టిస్ వి.గోపాలకృష్ణారావుకు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ హైకోర్టు జడ్జితో కొంతసేపు మాట్లాడారు.

గడియారం హాస్పిటల్‌ను ప్రయివేటుకు ఇవ్వొద్దు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గడియారం హాస్పిటల్ అభివృద్ధి పేరుతో ప్రవేట్ సంస్థలకు, వ్యక్తులకు ఇస్తే అంగీకరించేది లేదని సిపిఎం నగర కార్యదర్శి ఎం రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎం డి షరీఫ్, సయ్యద్ ఖాజా పాషా, మహబూబ్ బాషాలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నగరంలోని, పాతబస్తీలో గడియారం హాస్పిటల్‌కు గత వందేళ్లకుపైగా చరిత్ర ఉందన్నారు. ఇది కాన్పులకు పేరు గాంచిన ఆసుపత్రి తెలిపారు. ఇది ప్రభుత్వ సర్వజన హాస్పిటల్ కంటే ముందు ప్రజలకు సేవలు అందించేదని ,సగం మందికి పైగా కర్నూలు జనాభాలోని ప్రజలు ఇక్కడ జన్మించారంటే అతిశయోక్తి కాదన్నారు. అటువంటి ఘనమైన చరిత్ర కలిగిన ఆసుపత్రికి కూటమి ప్రభుత్వం , నగరపాలక సంస్థ అధికారులు కలిసి అభివృద్ధి పథంలో నడిపించి డాక్టర్లను సిబ్బందిని నియమించాల్సింది పోయి ప్రైవేట్ సంస్థలకు ,వ్యక్తులకు ఇవ్వడాన్ని సిపిఎంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. తక్షణమే ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు ఇవ్వడాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజలకు సౌకర్యవంతమైన ప్రభుత్వ రంగ సంస్థ అయిన గడియారం హాస్పిటల్‌లో ప్రభుత్వ డాక్టర్లు, సిబ్బంది ఉండాలి తప్ప , ప్రైవేట్ వ్యక్తులకు సంస్థలకు ఇవ

పేదరిక నిర్మూలనకు పి4

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పి4 విధానాన్ని ప్రవేశపెట్టారని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రణాళికలో భాగంగా పి4పై సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు, పరిశ్రమల నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో పేద నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయడమే పి4 లక్ష్యమని తెలిపారు. నియోజక వర్గంలో 7,730 కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నాయని, గ్రామాల్లో 4,957 మంది, పట్టణంలో 2366 మంది ఉన్నారని చెప్పారు. 2,172 కుటుంబాల కు 363 మార్గదర్శకులు ముందుకొచ్చినట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయం తరపున 2 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు చెప్పారు. డిఆర్‌డిఎ పీడీ రమణ రెడ్డి, మండల బీసీ సంక్షేమ అధికారి ప్రసన్న, తహశీల్దార్లు శేషఫణి, శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎంపిడిఓ బంగారమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

పి4 కుటుంబాలపై ప్రత్యేక దృష్టి

- హౌసింగ్ పీడీ చిరంజీవి

ప్రజాశక్తి - హోళగుంద

మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ

పి4లో ఉన్న కుటుంబాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ చిరంజీవి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పి4 సర్వే నిర్వహించడం వల్ల మండలంలో 17 పంచాయతీల్లో గల కుటుంబాల స్థితిగతులపై అవగాహనకు వచ్చినట్లు తెలిపారు. పి4లో ఉన్న కుటుంబాలను అన్ని శాఖల మండల స్థాయి అధికారులు ఒక్కొక్కరు 5 నుంచి 6 కుటుంబాలను దత్తత తీసుకొని ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన సంక్షేమ పథకాలతో పాటు వారు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే హౌసింగ్ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అనంతరం హోళగుందలో ఓ బంగారు కుటుంబాన్ని కలిశారు. తహశీల్దార్ (ఎఫ్‌ఏసి) నిజాముద్దీన్, ఎంపిడిఓ విజయ లలిత, హౌసింగ్ ఎఇ గోపీనాథ్ వర్మ, ఏపీవో పి.తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

ఇంటి అసెస్‌మెంట్‌ను పూర్తి చేయాలి

- డిఎల్‌పిఓ తిమ్మక్క

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

సమీక్ష నిర్వహిస్తున్న డిఎల్‌పిఓ తిమ్మక్క

మండలంలో వివిధ పంచాయతీల్లో ఇంటి అసెస్‌మెంట్‌ను ఆగస్టులోపు పూర్తి చేయాలని డిఎల్‌పిఓ తిమ్మక్క తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిఎల్‌పిఓ తిమ్మక్క, ఎంపిడిఓ జనార్ధనలు గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లు, ఇతర ఆదాయాలకు సంబంధించి అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, 'స్వర్ణ పంచాయతీ' పేరుతో కొత్తగా వెబ్‌సైట్‌ను రూపొందించి సంబంధిత పంచాయతీకి ఆన్‌లైన్‌లో పన్నుల చెల్లింపునకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. పంచాయతీకి సంబంధించి అన్ని చెల్లింపులు ఆన్‌లైన్‌లో నిర్వహించేలా డిజిటలైజేషన్ చేస్తోందని, పంచాయతీల పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరగనుందని చెప్పారు. జిల్లాలో ఆదోని స్వర్ణ పంచాయతీ యాప్ నమోదులో ఆదోని మండలం వెనుకంజలో ఉన్న విషయాన్ని జిల్లా అధికారులు సైతం తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. రెండు రోజుల్లో అన్ని పంచాయతీల బిల్లుల వసూలు రసీదులను యాప్‌లో నమోదు చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - మంత్రాలయం

హోస్పేట్ డ్యాంకు వరద నీరు చేరడంతో తుంగభద్ర నది దిగువకు 60-90 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారని, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు, భక్తులు, జాలర్లు, పుట్టి నిర్వహకులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ కె.రమాదేవి సూచించారు. వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది ప్రవాహాన్ని పరిశీలించారు. శనివారం స్థానిక శ్రీరాఘవేంద్రస్వామి మఠం వెనక భాగంలో ఉన్న తుంగభద్ర నది ఘాట్ వద్ద ప్రవాహంపై పోలీసులను, శ్రీమఠం సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఇప్పటికే శ్రీరాఘవేంద్రస్వామి మఠం వారు మైకు ద్వారా నదీ ప్రవాహం అధికంగా ఉందని, లోపలికి ఎవరూ వెళ్లకూడదని హెచ్చరికలు చేస్తున్నారని తెలిపారు. పోలీసు శాఖ నుంచి ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం, పోలీసు, శ్రీమఠం నుంచి సెక్యూరిటీ సిబ్బంది పహారా కాస్తున్నారని చెప్పారు. ఆర్‌ఐ జనార్ధన్ రావు ఉన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాటాలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అంజిబాబు

ప్రజాశక్తి- ఆలూరు

విద్యుత్ సంస్కరణల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టబెట్టిన స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎమ్‌డి.అంజిబాబు కోరారు. శనివారం ఆలూరులోని జ్యోతిబసు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కెపి.నారాయణ స్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలో భాగంగా ప్రజలపై భారాలు వేస్తోందని, గత వైసిపి హయాంలో స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారాలు వేయడానికి ప్రయత్నించారని తెలిపారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, లోకేష్ 'స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టండి. మేం అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తాం' అని చెప్పారని గుర్తు చేశారు. ఎన్నికల్లో కూటమి గెలిచాక ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు మరిచి స్మార్ట్ మీటర్లను బిగించడం ప్రజలను వంచించడమేనని విమర్శించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి ప్రజా క్షేత్రంలోకి వెళ్లి ప్రజలను చైతన్యం చేస్తూ సంతకాల సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఆగస్టు 4న వామపక్ష ప్రజాతంత్ర శక్తులను కూడగట్టి సబ్ స్టేషన్ల ఎదుట ధర్నాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, నాయకులు కృష్ణ, వెంకటేశ్వర్లు, షాకీర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

స్మార్ట్ మీటర్లపై పోరాటం

- వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సమిష్టి పోరాటాలకు సిద్ధం కావాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని షేర్ ఖాన్ కొట్టాల ప్రాంతంలో కరపత్రాలు విడుదల చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి వీరేష్, జిల్లా సమితి సభ్యులు సుదర్శన్, ఎఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు భీమేష్, యంకప్ప, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నాగరాజు, ఐఎఫ్‌టియు నాయకులు చెన్నకేశవులు, బిడిఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు రమేష్, డివైఎఫ్‌ఐ జిల్లా నాయకులు వీరేష్, పట్టణ కార్యదర్శి వెంకటేశులు, పిడిఎస్‌యు నాయకులు సోమశేఖర్, నాగరాజు మాట్లాడారు. విద్యుత్ దోపిడీలో పాలక పార్టీలు ఒకటే దారిగా ఉన్నాయని తెలిపారు. బడా కంపెనీలకు దోచిపెట్టడం, పాలకుల జేబులు నింపుకోవడం, వినియోగదారులను దండుకోవడంలో అందరూ ఒకటేనని విమర్శించారు. రైతుల పంపుసెట్లకు మీటర్లు పెట్టడానికి ప్రయత్నిస్తే రైతులు ఎదురు తిరిగితే ఆపారని, ఇప్పుడు ముందుగా కార్యాలయాలకు, తర్వాత వ్యాపార సంస్థలకు మీటర్లు బిగించారని తెలిపారు. ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సన్నద్ధమవుతున్నారని చెప్పారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఇంటికి స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు పోరాటాలకు రావాలని కోరారు. ఆగస్టు 5న విద్యుత్ డిఇ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కరపత్రాలు పంచుతున్న నాయకులు

'సూపర్ సిక్స్'తో ప్రజలకు ఎగనామం

- వైసిపి జిల్లా కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

రాష్ట్రంలో సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు ఎగనామం పెట్టిన ఘనుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని వైసిపి జిల్లా కార్యదర్శి పి.మురళీమోహన్ రెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని వందగల్లు గ్రామంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ'ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు చేపట్టారు. వందగల్లు గ్రామంలో సర్పంచి కాల్వ కోరవంజమ్మ, వైసిపి సీనియర్ నాయకులు లక్ష్మయ్య ఆధ్వర్యంలో ప్రతి గడపకూ వెళ్లి కూటమి పాలనకు, జగన్ పాలనకు ఉన్న వ్యత్యాసం వివరించారు. కన్వీనర్ బెట్టనగౌడ, ఎంపిపి ఈరన్న పాల్గొన్నారు.



వందగల్లులో ప్రజలకు వివరిస్తున్న నాయకులు

మధ్యంతర భృతి చెల్లించాలి : డిటిఎఫ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వేతన సవరణ సంఘం కాల పరిమితి ముగిసినందున కొత్త వేతన సవరణ సంఘాన్ని నియమించి, మధ్యంతర భృతి చెల్లించాలని డిటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, గౌరవాధ్యక్షులు కె.వీరన్న, జిల్లా కార్యదర్శి కె.గంగాధర్, నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎంఎస్‌కె.కిషోర్, రాఘవేంద్రరావు మాట్లాడారు. బదిలీలు, ఉద్యోగోన్నతుల ద్వారా ఉపాధ్యాయులు కొత్త పాఠశా లల్లో విధులు నిర్వహిస్తున్న ప్పటికీ అప్‌డేటేషన్ ఐడిలు రాక జీతాలు రెండు నెలలు గా పొందడం లేదని తెలిపారు.

మాట్లాడుతున్న నాయకులు

ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వ విద్య బలోపేతానికి పోరాటం
- ప్రత్యేక హాస్టళ్లు ఏర్పాటు చేయాలి
- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్బులా, రంగప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్బులా, రంగప్ప కోరారు. శనివారం పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా 48వ ప్లీనరీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో పనుల్లేక చాలామంది ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్తూ పిల్లలను ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించి వలస వెళ్లాలని అనుకుంటే ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఏ రెసిడెన్షియల్ హాస్టల్‌లో సీట్లు దొరకడం లేదన్నారు. ఈ ఇబ్బంది ముఖ్యంగా అమ్మాయిల చదువులకు ఆటంకంగా మారిందన్నారు. ఒకవైపు కెజిబివిలలో సీట్లు రాక మరోవైపు సాంఘిక సంక్షేమ హాస్టల్లో సీట్లు రాకపోవడంతో ప్రయివేట్ రెసిడెన్షియల్‌లో చదివించే స్తోమత లేకపోవడంతో వారితో పాటు వలసలకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహించి వలస వెళ్తున్న విద్యార్థులను బడిలో చేర్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం సంక్షేమ హాస్టల్‌లో, గురుకులాల్లో, కెజిబివిలలో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేరుకు మాత్రమే యూనివర్సిటీలుగా ఉన్న రాయలసీమ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆదోని మెడికల్ కళాశాలను ప్రభుత్వమే పూర్తి చేసి అడ్మిషన్లు ప్రారంభించే విధంగా జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ కృషి చేయాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సాయి ఉదయ్, విజయ్, జిల్లా నాయకులు రాము పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ.నెం. 1684/2024 ఇన్ ఐ.ఎ.నెం. 537/2024
ఇన్
ఎ.యస్.నెం. /2024
వి.రాజేశ్వరి ... అర్జీదారు/అప్పిలెంటు
-వర్సెస్-
వి.రామదాసు (డ్రెడ్) మరియు ఇతరులు
... రెస్పాండెంట్లు
నోటీసు టు ప్రపోస్‌డ్ పార్టీ రెస్పాండెంటు నెం.1కు
ఆర్.3.వి.లక్ష్మి భర్త లేటు వి.రామదాసు.
ఆర్.4.వి.రాజరాములు తండ్రి లేటు వి.రామదాసు.
ఆర్.5.వి.సురేంద్ర తండ్రి లేటు వి.రామదాసు.
ఆర్.6.వి.దేవి తండ్రి లేటు వి.రామదాసు.
అందరి నివాసం.కొట్టాల గ్రామము,
వెల్దుర్తి మండలం, కర్నూలు జిల్లా.
ఇందుమూలంగా పైన కనబరచిన ఐ.ఎ.నెంబరులో 3 నుండి 6 రెస్పాండెంట్లు అయిన మిమ్మల్ని వి.రామదాసు.(ఆర్. 1) వారసులుగా పై కేసులో చేర్చమని కోరుతూ పైన తెల్పిన అర్జీదారు ఐ.ఎ.నెం. 1684/2024 పై కనబరచిన కోర్టులో అర్జీదాఖలు చేసినారు. సదరు విషయమై 3 నుండి 6 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 1-08-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదురు అర్జీని మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా :1-8-2025
కె.లోకేశ్వరరెడ్డి
అర్జీదారు పరం అడ్వకేటు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ.నెం. 1685/2024 ఇన్ ఎ.యస్.నెం. /2024
ఇన్ సి.యఫ్.ఆర్.నెం. 730/2024
వి.రాజేశ్వరి ... అర్జీదారు/అప్పిలెంటు
-వర్సెస్-
వి.రామదాసు (డ్రెడ్) మరియు ఇతరులు
... రెస్పాండెంట్లు
నోటీసు టు ప్రపోస్‌డ్ పార్టీ, యల్.ఆర్స్ ఆర్.1కు
ఆర్.3.వి.లక్ష్మి భర్త లేటు వి.రామదాసు.
ఆర్.4.వి.రాజరాములు తండ్రి లేటు వి.రామదాసు.
ఆర్.5.వి.సురేంద్ర తండ్రి లేటు వి.రామదాసు.
ఆర్.6.వి.దేవి తండ్రి లేటు వి.రామదాసు.
అందరి నివాసం.కొట్టాల గ్రామము,
వెల్దుర్తి మండలం, కర్నూలు జిల్లా.
ఇందుమూలంగా పైన కనబరచిన ఐ.ఎ.నెంబరులో 3 నుండి 6 రెస్పాండెంట్లు అయిన మిమ్మల్ని వి.రామదాసు.(ఆర్. 1) వారసులుగా పై కేసులో చేర్చమని కోరుతూ పైన తెల్పిన అర్జీదారు ఐ.ఎ.నెం. 1685/2024 పై కనబరచిన కోర్టులో అర్జీదాఖలు చేసినారు. సదరు విషయమై 3 నుండి 6 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 1-08-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదురు అర్జీని మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా :1-8-2025
కె.లోకేశ్వరరెడ్డి
అర్జీదారు పరం అడ్వకేటు,
కర్నూలు.

తాగునీటి సరఫరాపై జాగ్రత్తలు అవసరం

- ఎంపిపి అమ్రేష్

ప్రజాశక్తి - కౌతాళం

వర్షాకాలం ప్రారంభమైందని, ప్రజలకు తాగునీటి సరఫరా పట్ల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిపి అమ్రేష్ కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయని, అధికారులు ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంకులను శుభ్రపరచి బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ చేసి నీటిని సరఫరా చేయాలని తెలిపారు. ఎఒ శేషాద్రి మాట్లాడుతూ... యూరియా కొరత ఉండదని, త్వరలోనే వ్యాగన్ వస్తుందని, ప్రతి గ్రామానికీ యూరియా అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పంట బీమాపై నదిచాగి ఎంపిటిసి నిలదీశారు. రైతులకు ఎలాంటి సమాచారమూ అందించడం లేదని తెలిపారు. ఆర్‌అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటినట్లు, వాటి పరిరక్షణ కోసం అధికారులు కృషి చేయాలని కోరారు. జాబ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో హౌసింగ్ బోర్డులో అవకతవకలు జరిగాయని సహకార సంఘం అధ్యక్షులు వెంకటపతి రాజు నిలదీశారు. ఉప్పరహాల్ గ్రామంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని, వాటిని సరి చేయాలని తుంగ భద్ర బోర్డు ఛైర్మన్ టిప్పు సుల్తాన్ కోరారు. సర్పంచి పాల్ దినకరన్ మాట్లాడుతూ... కౌతాళానికి మరో రెండు ఒహెచ్‌ఆర్ ట్యాంకులను మంజూరు చేయాలని, ప్రజలకు ప్రభుత్వ పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. కోఆప్షన్ సభ్యులు మాబు సాబ్ మాట్లాడుతూ... వివిధ శాఖల అధికారులు సమయపాలన పాటించాలని, సమావేశం గౌరవాన్ని కాపాడాలని కోరారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. మండలంలో ఆర్‌అండ్‌బి రోడ్లు దెబ్బ తిన్నాయని, ఆ శాఖ అధికారి సమావేశానికి హాజరు కాకపోవడం పట్ల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిటిసిలకు గౌరవ వేతనం అందించాలని వినతిపత్రం అందజేశారు. వైస్ ఎంపిపిలు బుజ్జి స్వామి, లిఖిత, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగ మల్లయ్య, పిఆర్ ఎఇ శ్రీనివాస్ రెడ్డి, ఎసర్టీస్ మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ రాజేంద్రప్రసాద్

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - నందవరం

మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి లక్ష్మీదేవమ్మ అధ్యక్షతన ఎంపిడిఓ పుల్లయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ... మండల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బాలకృష్ణ మాట్లాడుతూ... తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరందించి సమస్యను పరిష్కరించామని తెలిపారు. నందవరం గ్రామంలో ఎల్‌ఎల్‌సి ద్వారా తిమ్మారెడ్డి కుంటను నింపామని చెప్పారు. ప్రస్తుతం గ్రామంలో తాగునీటి సమస్య తీరిందన్నారు. పశు సంక్షేమ శాఖాధికారి నరేంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ... పశువులకు టీకాలను వేసి ఐదు, ఆరు రకాల వ్యాధుల నుంచి కాపాడమని తెలిపారు. పశువులకు ఎక్కువ ఇబ్బంది కలిగించే వ్యాధి గుల్లలు రావడమని, ఈ వ్యాధి నివారణకు నిరంతరం కృషి చేశామని చెప్పారు. ఎంఇఒ రఘునాథ మాట్లాడుతూ... పాఠశాల ప్రారంభమయ్యే సమయానికి విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలను అందించామని తెలిపారు. జూన్ 30 నాటికి విద్యార్థులకు బూట్లు, యూనిఫారాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాశక్తి పథకాన్ని అమలు చేశామన్నారు. రోజూ పాఠశాల ముగిసిన తర్వాత ఒక గంట ప్రయివేట్ క్లాసులు తీసుకుంటున్నట్లు తెలిపారు. వెలుగు ఎపిఎం రాఘవేంద్ర మాట్లాడుతూ... మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. పొదుపు సంఘాల మహిళలకు రూ.18 కోట్ల రుణాలను ఇచ్చామని చెప్పారు. శ్రీనిధి కింద రూ.3 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ... రెవెన్యూ పరంగా ప్రజలకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ అధికారి నరసింహులు మాట్లాడుతూ... రూ.4 కోట్లతో గ్రామాల్లో రోడ్లను అభివృద్ధి చేశామని తెలిపారు.

మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మీ దేవమ్మ

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యం

- టిడిపి నియోజకవర్గ పరిశీలకులు, ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు

ప్రజాశక్తి - చిప్పగిరి

బడుగు, బలహీన వర్గాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టిడిపి ఆలూరు నియోజకవర్గ పరిశీలకులు, ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు తెలిపారు. శనివారం నేమకల్లు బస్టాండ్ నుంచి చిప్పగిరి మీదుగా బంటనహళ్ వరకు మాజీ జడ్పిటిసిల సంఘం జిల్లా అధ్యక్షులు ఏరూరు మీనాక్షినాయుడు, టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ ఆధ్వర్యంలో సుమారు 300 మంది బైకులతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నాగరాజు హాజరయి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'తో గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో టిడిపి నాయకులు విభేదాలు విడిచి ఐకమత్యంతో పార్టీ ప్రయోజనాల కోసం, అభివృద్ధికి పనిచేయాలని చెప్పారు. సర్పంచి పురుషోత్తం, బంటనహాల్ సర్పంచి సుశీలమ్మ, నాయకులు హరి, మాజీ వైస్ ఎంపిపి వెంకటేశులు, మిరపకాయల చంద్ర, పాముల సన్నప్ప, శివలింగ, భాస్కర్, బిజెపి అధ్యక్షులు గోపాల్, జనసేన అధ్యక్షులు చిరంజీవి ఆధ్వర్యంలో నాగరాజుకు, మీనాక్షి నాయుడుకు స్వాగతం పలికి శాలువా, పూలమాలతో సన్మానించారు. టిడిపి నాయకులు జనార్ధన్ స్వామి, బోగేష్, ఉమాపతి, గోపాల్, కొనంకి సతీష్, నీటి సంఘం అధ్యక్షులు ధనంజయ, శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి నరసింహులు, శివన్న పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ బదిలీ సహజం

- ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి విజయ భాస్కర్

ప్రజాశక్తి- దేవనకొండ

ప్రతి ఉద్యోగికీ బదిలీ సహజమని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి విజయభాస్కర్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఆరోగ్య కార్యకర్తలను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కరివేములలో పని చేస్తున్న ఎం.హేమలత, కుంకనూరులో పనిచేస్తున్న సరస్వతి, నేలతలమర్రిలో పనిచేస్తున్న సరోజ, మాచాపురంలో పనిచేస్తున్న రాజేశ్వరి, పల్లెదొడ్డిలో పనిచేస్తున్న శివమ్మ, నెల్లిబండలో పనిచేస్తున్న సుజాత, జిల్లెడ బుడకలలో పనిచేస్తున్న షేకమ్మ, అలారుదిన్నెలో పనిచేస్తున్న వీరమ్మ బదిలీపై వెళ్లారన్నారు. వారిని వైద్య ఆరోగ్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. వైద్యాధికారి కల్యాణ్, ఆరోగ్య విస్

ఈ బ్రిడ్జిపై దాటేదెలా..?

- కాలువలో పడిన విద్యార్థి

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఉరుకుంద పంచాయతీ మజరా గ్రామం ఓబులాపురం బ్రిడ్జిని దాటేదెలా అంటూ కూలీలు, రైతులు, విద్యార్థులు గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. శనివారం గ్రామానికి చెందిన సిద్ధ రాముడు కుమారుడు కృష్ణ కాలువలో పడ్డారు. కృష్ణ ఉరుకుంద గ్రామంలోని హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నారు. సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో తుంగభద్ర దిగువ కాలువ ఉప కాలువ (మాధవరం మేజర్)పై ఉన్న బ్రిడ్జి దాటుతుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడ్డారు. కాలువ గట్టుపై ఉన్న వ్యవసాయ కూలీలు గమనించి వెంటనే ఆ విద్యార్థిని రక్షించారు. ఈ బ్రిడ్జి విషయంపై గతంలో ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నా వెలుగులోకి రావడం లేదన్నారు. సంబంధిత అధికారులు కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాలువలో పడిన విద్యార్థి

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ వితరణ

కంప్యూటర్, ప్రింటర్‌ను అందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఆదోని రూరల్

పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌కు శ్రీమహాయోగి లక్ష్మమ్మ కో ఆపరేటివ్ బ్యాంకు తరపున రూ.60 వేల విలువ గల కంప్యూటర్, ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. శనివారం బ్యాంకు వైస్ ఛైర్మన్ బి.లక్ష్మీనారాయణ శెట్టి, డైరెక్టర్లు ఎస్.హుస్సేన్ అహ్మద్, ఎస్.సురేష్ గుప్త, ఆర్ఎం.విరుపాక్షి రెడ్డి చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయులు కె.రవి, ఉపాధ్యాయులు జి.వీరభద్ర యాదవ్‌కు అందజేసినట్లు బ్యాంకు ఛైర్మన్ రాయచోటి రామయ్య తెలిపారు.

కౌలుకార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలి

- తహశీల్దార్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - నందవరం

కౌలు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం కౌల రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... కౌలుకు సాగు చేస్తున్న రైతులు గుర్తింపు కార్డు కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే పంట రుణాలు పొందాలంటే కౌలు కార్డు కచ్చితంగా ఉండాలని చెప్పారు. సాగు చేస్తున్న పొలం యజమాని వివరాలు, సర్వే నెంబరు, సాగు విస్తీర్ణం అప్లికేషన్‌లో పొందపరచాలని సూచించారు. అప్లికేషన్‌ను సంబంధిత రెవెన్యూ అధికారులకు అందించాలని తెలిపారు. రెవెన్యూ అధికారులు రవీంద్రారెడ్డి, రామేశ్వరమ్మ, నరసప్ప పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

మాట్లాడుతున్న ఎస్ఐ శివాంజల్

విద్యార్థినులపై ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ శివాంజల్ హెచ్చరించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరుకోవడానికి మెట్లుగా ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రేమ పేరుతో ఈవ్ టీజింగ్‌కు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలిపారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేసినా, అసభ్యంగా ప్రవర్తించినా తన ఫోన్ నెంబర్ 9121101152కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు హంపయ్య, ఉపాధ్యాయులు విరోభరావు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్సీ బీటీ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్సీ బీటీ.నాయుడును నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్సీల కోటా కింద రెండోసారి ఎమ్మెల్సీగా ఎంపికైన బీటీ.నాయుడును ఎక్స్ అఫీషియో సభ్యులుగా ప్రొటోకాల్ పాటించాలని కలెక్టర్, ఎస్పీ కార్యాలయానికి ఉత్తర్వులు వచ్చాయి. బీటీ.నాయుడు 2009, 2014లో కర్నూలు పార్లమెంట్ నుంచి ఎంపీగా పోటీ చేశారు. టిడిపి అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జీగా, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్‌గా, టిడిపి జిల్లా అధ్యక్షులుగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అసెంబ్లీ ఉపనాయకుడిగా అప్పటి ప్రభుత్వం తీరుపై ఎనలేని పోరాటాలు చేశారు. టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బీటీ సేవలను గుర్తించి రెండోసారి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. పార్టీకి విధేయుడుగా ఉన్న బీటీని ఆదోనిని అభివృద్ధి పథంలో నడపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదోని మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమిస్తూ

ఉత్తర్వులు జారీ చేసింది. ఆదోనిని అభివృద్ధి చేయడంలో, నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రితో పాటు, కేబినెట్ మంత్రుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించుకునే నిబద్ధత, పట్టుదల కలిగిన ఎమ్మెల్సీ బీటీ.నాయుడును ఆదోని మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమించడం పట్ల ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు శనివారం హర్షం వ్యక్తం చేశారు.

ట్రావెల్ బస్సు ఢీకొని భక్తురాలికి గాయాలు

ప్రజాశక్తి - మంత్రాలయం

గాయపడిన భక్తురాలు

రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన భక్తురాలిని మనోజ్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఢీకొని గాయాలయ్యాయి. శనివారం రాఘవేంద్ర సర్కిల్ నుంచి రాయచూరు వెళ్లే రహదారిపై నిలబడిన మహిళను బస్సు ఢీకొట్టింది. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన మానస రాఘవేంద్రస్వామి దర్శనార్థమై బంధువులతో కలిసి శుక్రవారం మంత్రాలయం వచ్చినట్లు తెలిపారు. స్వామి వారి దర్శనం అనంతరం చుట్టుపక్కల ఉన్న ఆలయాలను ఆటోలో సందర్శించి తిరిగి వచ్చిన వారు ఆటో దిగి నిలబడ్డారు. ఆమెను బస్సు ఢీకొనగా కిందపడ్డారు. వెంటనే సమీపంలో ఉన్న శ్రీమఠం నిర్వహణలో ఉన్న శ్రీసుజయీంద్ర ఆరోగ్యశాలలో చికిత్స చేయించగా తలకు భలమైన గాయమయిందని, 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉంటే కాని చెప్పలేమని వైద్యులు డాక్టర్ సుజయీంద్ర తెలిపారు. గాయపడిన మానస మాట్లాడుతూ... తల నొప్పి, నడుముకు గాయాలతో నొప్పి ఉందని చెప్పారు. పోలీసులు విచారణ చేపట్టారు.

భక్తురాలిని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

అమరావతిలో సోమప్ప భవన్ నిర్మించాలి

- ఎమ్మెల్యే బీవీ, ఎంజి కుటుంబ సభ్యులు సహకరించాలి

- సిఎం చంద్రబాబుకు కోనేరు లేఖ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు చేనేత పితామహుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మాచాని సోమప్ప పేరుపై రాష్ట్ర రాజధాని అమరావతిలో చేనేత భవన్ నిర్మించాలని మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్ కోరారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ పంపారు. 'మాచాని సోమప్ప ఎమ్మిగనూరు ప్రజలతో పాటు దేశ ప్రజలకు చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇచ్చింది. అప్పటి ఉమ్మడి ఎపి రాజధాని హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రధాన రోడ్డులో చేనేత భవన్‌కు మాచాని సోమప్ప భవన్‌గా నామకరణం చేశారు. అది చూసిన ఇక్కడి ప్రజలకు గర్వంగా ఉండేది. చేనేత సహకార రంగంలో సోమప్ప సేవలను దేశం హర్షించింది. రాష్ట్రం విడిపోయిన తర్వాత మాచాని సోమప్ప భవన్ (హ్యాండ్లూమ్ హౌస్) లేకుండా పోయింది. చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకొని అమరావతిలో 5 ఎకరాలు స్థలం కేటాయించి మాచాని సోమప్ప భవన్ పేరుతో హ్యాండ్లూమ్ హౌస్ నిర్మించి అక్కడ ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి. మాచాని గంగన్న బ్రదర్స్ (ఎంజి బ్రదర్స్)తో ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి సహకరించాలని కోరారు.

బాలుని పరిశీలిస్తున్న నూకరాజు

దేవనకొండలో డెంగీ కేసు నమోదు

- పరిశీలించిన జిల్లా మలేరియా నివారణాధికారి నూకరాజు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ గ్రామంలోని పాత మార్కెట్ వీధిలోని ఇస్మాయిల్ కుమారుడు తన్వీర్ డెంగీ వ్యాధికి గురయ్యారు. గత నాలుగు రోజులుగా జ్వరం రావడంతో కర్నూలు జనరల్ హాస్పిటల్‌లో చేర్పించి చికిత్స చేయించారు. శనివారం డెంగీ వ్యాధి నిర్ధారణ కావడంతో దేవనకొండ వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమై ఆ ఇంటి పరిసరాలను పంచాయతీ సిబ్బందితో ద్రావణం పిచికారి చేయించి బ్లీచింగ్ పౌడర్ కాలువల్లో చల్లించారు. ప్రతి ఇంట్లో లార్వా ఉన్న గచ్చులను, డ్రమ్ములను పరిశీలించి లార్వాను తొలగించారు. జిల్లా మలేరియా నివారణాధికారి నూకరాజు తనిఖీ చేసి సిబ్బందికి దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణుడు, ఆరోగ్య విస్తరణ అధికారి రంగస్వామి, సూపర్‌వైజర్లు శ్రీధర్, మాదమ్మ పాల్గొన్నారు.

ప్రజల సేవే రోటరీ క్లబ్ లక్ష్యం

- ఛైర్మన్ చిన్నప రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజల ఆరోగ్య సంరక్షణతో పాటు సమాజ సేవలు చేయడమే రోటరీ క్లబ్ లక్ష్యమని రోటరీ క్లబ్ ఛైర్మన్ చిన్నప రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని సోమప్ప నగర్ శ్రీఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మిగనూరు ఆర్‌కె కంటి వైద్యులు హేమంత్ కుమార్ పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మిగనూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు కెఆర్.శ్రీనాథ్ రెడ్డి, కార్యదర్శి సుధాకర్ రావు, కోశాధికారి మాచాని నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కెఆర్.నటరాజ్ రెడ్డి నియమించినట్లు తెలిపారు. రోటరీ క్లబ్ సభ్యులు మాచాని వెంకటేష్, న్యాయవాది గురురాజ రావు, నరహరి శ్రీనివాస్ రెడ్డి, శివరామి రెడ్డి, పాల శ్రీనివాస రెడ్డి, అగ్రహారం నాగిరెడ్డి, యాపిల్ ల్యాబ్ బీరప్ప, డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో పాల్గొన్న పట్టణ ప్రజలు

శ్రీమఠానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠానికి భక్తుల నుంచి రూ.లక్ష విరాళం పచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన శైలా వెంకటేష్ అనే భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారని, శ్రీమఠంలో జరుగుతున్న దైనిక సంపూర్ణ సేవకు రూ.లక్ష విరాళం ఇచ్చారని చెప్పారు. వారికి శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు శేషవస్త్రం అందజేసి ఆశీర్వదించినట్లు చెప్పారు.

'టిడిపితోనే అభివృద్ధి'

సంక్షేమ పథకాలను వివరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -దేవనకొండ

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి జిల్లా కార్యదర్శి సభ్యులు మలకన్న, ఆలూరు తెలుగు యువత అధ్యక్షులు రాజాసాబ్, టిడిపి నాయకులు రాజయ్య తెలిపారు. శనివారం దేవనకొండలోని 2వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టిడిపి నాయకులు మస్తాన్, చాంద్ బాషా, తిమ్మయ్య, రాముడు, హనుమంతు, బంగి రంగన్న, మురళీ పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటాం

- ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు చిక్కం జానయ్య

ప్రజాశక్తి - నందవరం

ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపకులు చిక్కం జానయ్య తెలిపారు. ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ అధ్యక్షులు శావల బుజ్జిబాబు అస్వస్థతకు గురై అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న జానయ్య శనివారం ఆయన గృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యాన్ని జాగ్రత్త చూసుకోవాలని సూచించారు. మండల ప్రధాన కార్యదర్శి శావల శాంతరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూడ రవి, జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల, జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జీ హనుమన్న, జిల్లా కార్యదర్శి రత్నం, జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శావల సత్యానందం, మండల ఇన్‌ఛార్జీ చింపిరి చిన్న పోతప్ప, ఎమ్మిగనూరు పట్టణ మహిళా అధ్యక్షులు కదిరికోట పద్మక్క, పట్టణ ఇన్‌ఛార్జీ కదిరికోట రాజు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న జానయ్య

మైనర్లు వాహనంతో పట్టుబడితే చర్యలు

ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దీన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వాహనం ఇచ్చిన వారికి, తల్లిదండ్రులపై చర్యలుంటాయని కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ తెలిపారు. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్ పర్యవేక్షణలో కర్నూలు నగరంలో లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే మైనర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్ విహార్ సెంటర్ లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిం చారు. లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతున్న మైనర్ ను పట్టుకున్నట్లు తెలిపారు. 15 మంది మైనర్ వాహనాలను కర్నూల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించిన ట్లు తెలిపారు. మైనర్లు పట్టుబడితే తక్షణమే కర్నూల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామని, మార్పు రాకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం లైసెన్స్‌లే కుండా బండి నడపబోమని మైనర్లచేత ప్రతిజ్ఞ చేయించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నిబంధనల వీడియో షోలు మరియు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు మైనర్లకు చూపించారు. మొదటిసారిగా కౌన్సిలింగ్ చేసి ,రెండవసారి పట్టు బడితే జరిమానాలు విధించనున్నామని ట్రాఫిక్ సిఐ మనసురుద్దీన్ తెలిపారు.

కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవం

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి వైద్యులు సాధారణ ప్రసవం జరిపించారు. శనివారం వేమగోడు గ్రామానికి చెందిన భారతికి మూడవ ప్రసవంలో ఆరోగ్యవంతమైన మగ శిశువు జన్మించారు. ఆసుపత్రి సిబ్బంది వైద్యాధికారి పర్యవేక్షణలో సాధారణ ప్రసవం జరిపించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బి.నాగరాజు వైద్య సిబ్బందిని అభినందించారు. తల్లి శిశువు ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారు. శిశువు బరువు 4.5 కేజీలు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులతో ప్రభుత్వ ఆసుపత్రిలోని సాధారణ ప్రసవాలను వైద్యులు జరిపిస్తున్నారు. ప్రస్తుతం వైద్యులు అందుబాటులో ఉండడంతో గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలకు ముందుకు వస్తున్నారు. వైద్య సిబ్బంది కూడా సాధారణ ప్రసవాలను పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ బి.నాగరాజు, డాక్టర్ డి.పుష్పలత, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ కె లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మ్యుటేషన్ విధానాన్ని జాగ్రత్తగా నిర్వహించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మాట్లాడుతున్న అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఆటో మ్యుటేషన్ (యజమాని పేరు ఆన్‌లైన్లలో మారడం) విధానాన్ని సచివాలయాల అడ్మిన్లు జాగ్రత్తగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. శనివారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో మ్యుటేషన్ విధానంపై అడ్మిన్లతో సమావేశం నిర్వహించారు. జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ మాట్లాడారు. మున్సిపల్ సేవల్లో పారదర్శకత పెంచేందుకు వీలుగా ఆగస్టు 1 నుండి ఆటో మ్యుటేషన్ ప్రక్రియను సరికొత్త విధానంలో అమలుల్లోకి తీసుకొస్తుందన్నారు. ఇందులో 4 రకాలుగా మ్యుటేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. ఇళ్ళులు, ప్లాట్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయించుకున్న వెంటనే ఆన్‌లైన్ విధానంలో ఆటో మ్యుటేషన్ (ఆన్‌లైన్‌లో పేరుతో ఆస్తి బదలాయింపు) జరుగుతోందని, అదేవిధంగా ఆస్తి పన్ను విధింపునకు అడ్మిన్‌ల లాగిన్‌లకు దరఖాస్తులు వస్తాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రక్రియ పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా శ్రీశైలం జలాశయం

రెండు గేట్ల ద్వారా నీటి విడుదల

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న నీటి ప్రవాహంతో జలాశయం నిండుకుండలా మారింది. జలాశయం నుండి యధావిధిగా రెండు గేట్ల ద్వారా దిగివకు నీటి విడుదలను చేస్తున్నారు. కుడి, ఎడమ జల విద్యుత్తు కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తిని యధావిధిగా కొనసాగిస్తున్నారు. శనివారం సాయంత్రము 6 గంటల సమయానికి ఎగువ జూరాల నుండి విద్యుత్ ఉత్పాదనతో 34,286 క్యూసెక్కులు, గేట్ల ద్వారా 35,820 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 31,928 క్యూసెక్కులు కలిపి 1,02,034 క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరుతున్నాయి. రెండు గేట్ల ద్వారా 53,764 క్యూసెక్కులు, రెండు విద్యుత్తు కేంద్రాల నుండి 66,245 క్యూసెక్కులు కలిపి దిగువ నాగార్జునసాగర్ కు 1,20,008 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. గడచిన 24 గంటలలో ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో 37,763 క్యూసెక్కుల నీటితో 17.150 మిలియన్ యూనిట్ల విద్యుత్తు, కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రంలో 31,083 క్యూసెక్కుల నీటితో 16.120 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. జలాశయ నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 882.40 అడుగులుగా ఉంది. నీటి నిలువ సామర్థ్యం 2015 టిఎంసిలకు ప్రస్తుతం 201.1205 టీఎంసీలుగా నమోదయింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడుకు 30,000 క్యూసెక్కులు, హంద్రీ నీవా సుజల స్రవంతికి 2,336 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ కు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

బాబు మోసాలు ఎండగట్టండి

మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ప్రజాశక్తి పత్తికొండ..



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయ లేదని బాబు మోసాలను ఎండగట్టాలని పత్తికొండ వైసిపి మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం పత్తికొండ పట్టణంలోని లక్ష్మీ నగర్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మాజీ ఎంపిపి నాగరత్నమ్మ, ఎంపిపి నారాయణ దాసు, సర్పంచి కొమ్ము దీపిక ఉపసర్పంచి పల్లె కళావతి తో కలిసి 'బాబు షూరిటీ మోసం గ్యారెంటీ' అంటూ ఇంటింటికి తిరుగుతూ బాబు మోసాలపై ప్రజలకు వివరించారు. కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నారని అన్నారు. రైతుల పక్షపాతి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భతి వివిధ రకాల పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి సంక్షేమ పథకాలు అందేంత వరకు పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి శ్రీరంగడు,బీసీ సెల్ అధ్యక్షులు శ్రీరాములు, వైసిపి బూత్ కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బనగాని శ్రీనివాసులు, మండల కన్వీనర్ కారం నాగరాజు, బాబుల్ రెడ్డి, రవి ప్రకాష్, వైసీపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ సౌజన్యంతో రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

మండలంలోని పులకుర్తి గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు వారు సాగు చేసిన పంట పొలాలకు సంబంధించి శిక్షణ నిర్వహించారు. డిఆర్‌సి (డిస్ట్రిక్ రిసోర్స్ సెంటర్) ఎడిఎ వెంకటేశ్వర్లు, ఉద్యాన అధికారి మదన్మోహన్, మండల వ్యవసాయ అధికారి ఎన్.రవి ప్రకాష్, ఆర్ఎస్‌కె సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు. చర్చించిన విషయాలు. పంట పొలాలలో అవసరానికి మించి రసాయనకి ఎరువులు వాడకాన్ని తగ్గించాలన్నారు. పురుగుమందుల వాడకాన్ని తగ్గించి ఆర్గానిక్ విధానంలో వేప నూనె, కషాయాలను వాడి పురుగుమందులను తగ్గించాలన్నారు. విత్తనాల ఎంపికలో రైతులు ఎప్పటికప్పుడు మెలకువలను పాటించాలని, భూసార పరీక్షల ఆధారంగా రసాయని చెరువులను వాడాలి తెలిపారు. గ్రామాలలో రైతులు అన్ని రకాల పంటలను సాగు చేయడం ద్వారా భూమి సారవంతం పెరుగునని తద్వారా మార్కెట్ ధరలు రైతుకు మంచిగా లభించునని ఒకే రకమైన పంటలను ఎక్కువ విస్తీర్ణాలలో సాగు చేయవద్దని తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను శనివారం జిల్లా కలెక్టర్ జి రాజకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ....మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు ఉన్నారని వారికి ఒక్కో క్లాస్‌కు ఒక టీచర్ ఉన్నారన్నారు. మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కటి విద్యను అందించాలన్నారు. ఆదర్శ పాఠశాల అంటే ప్రతి అంశంలోనూ ఏ గ్రేడ్ లో ఉండాలన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయని ఉపాధ్యాయులు చొరవ తీసుకొని పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మోడల్ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణులు అయ్యేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలనిఅన్నారు. ఇకనుంచి పాఠశాలలను తరచూ విజిట్ చేస్తామని, పాఠశాలల్లో అపరిశుభ్రత నెలకొన్నట్లయితే చర్యలు తీసుకుంటామని అక్కడ ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ సూచించారు.